# సాక్షి
## వికారాబాద్

ఆదివారం : 22 : అక్టోబర్ : 2023






**కాబోయే సీఎం రేవంత్‌రెడ్డి**

తెలంగాణకు కాబోయే సీఎం రేవంత్‌రెడ్డి అని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి జోస్యం చెప్పారు. 10లో▸



**నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే..**

అక్రమ రవాణా అరికట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ కమిషనర్ డేవిడ్ రవికాంత్ అన్నారు. 10లో▸



**కనుమరుగవుతున్న 'వామ'**

వామ పంట సాగు గణనీయంగా తగ్గింది. పత్తి, కంది, చెరుకు పంటకు చూపిస్తున్న శ్రద్ధ రైతులు వామపై చూపడం లేదు. 11లో▸

## న్యూస్‌రీల్

### మార్గదర్శకాలు తప్పక పాటించాలి

కలెక్టర్ సి.నారాయణరెడ్డి



కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఎస్పీ తదితరులు

**వికారాబాద్ అర్బన్:** ఎన్నికల నేపథ్యంలో నిర్వహించే తనిఖీల్లో పట్టుబడిన బంగారం, నగదు సీజ్ చేసేప్పుడు ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలను తప్పక పాటించలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, అదనపు డీజీపీ అంజని కుమార్ ఇతర ఉన్నత స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఎస్పీ పాల్గొన్నారు. అనంతరం వారు జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కోడ్ ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రాజకీయ పార్టీల అభ్యర్థుల నుంచి వచ్చే ఫిర్యాదులకు తీసుకున్న చర్యలపై లిఖితపూర్వక సమాధానం ఇవ్వాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, రాహుల్ శర్మ పాల్గొన్నారు.

### ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

ఎస్పీ కోటిరెడ్డి




మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

**అనంతగిరి:** ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ కోటిరెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా పీఎస్‌ల పరిధిలో చేపడుతున్న చర్యల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో ప్రజలకు ఎన్నికల విధానంపై అవగాహన కల్పించాలన్నారు. ర్యాలీలు, సభలు, సమావేశాలకు ఖచ్చితంగా అనుమతులు తీసుకునేలా చూడాలన్నారు. చెక్ పోస్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. క్షేత్ర స్థాయి సమాచారం ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, డీటీసీ ఏఎస్పీ మురళీధర్, డీఎస్పీలు కరుణాసాగర్ రెడ్డి, నర్సింలు, శేఖర్ గౌడ్, విజయ్‌కుమార్, జానయ్య, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

### ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

మాల మహానాడు అధ్యక్షుడు వెంకటయ్య




మాట్లాడుతున్న వెంకటయ్య

**పరిగి:** హక్కుల సాధనకు ఆదివారం నిర్వహించనున్న మాలల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు సుల్తాన్‌పూర్ వెంకటయ్య అన్నారు. శనివారం ఆయన పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. ఉదయం 11 గంటలకు శారదా గార్డెన్‌లో నిర్వహించే సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ వివేక్‌వెంకటస్వామి, ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కాసాని వీరేశ్, మారుతికిరణ్ తదితరులు హాజరువుతారని చెప్పారు. నాయకులు వెంకటయ్య, శ్రీనివాస్, రాములు, యాదయ్య పాల్గొన్నారు.

### బీఎల్‌ఓ, సూపర్‌వైజర్లపై వేటు

**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** ఓటర్ల జాబితా రూపకల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బూత్ లెవెల్ అధికారి, సూపర్‌వైజర్లపై జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ భారతి హోళికేరి సస్పెన్షన్ వేటు వేశారు. శేరిలింగంపల్లి శాసనసభా నియోజకవర్గం 335 పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటర్ల జాబితాలో తప్పిదాలు చోటుచేసుకున్నాయని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు అందింది. ఈసీ ఆదేశాల మేరకు కలెక్టర్ విచారణ జరిపించగా, పొరపాట్లు జరిగినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బీఎల్‌ఓ సుజాత, సూపర్‌వైజర్ గణేశ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# ఏ గట్టునుంటారో!



నియోజకవర్గ మ్యాప్

ఎన్నికల వేళ పార్టీ ఫిరాయింపులు జోరందుకున్నాయి. బడా నేతలతో పాటు ద్వితీయ శ్రేణి నాయకులపై ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. జంపింగ్ జపాంగ్‌లు ఎక్కువవ్వడంతో ఎవరు ఏ కండువా కప్పుకుంటారో తెలియని పరిస్థితి నెలకొంది.

**కొడంగల్‌లో పొలిటికల్ హీట్**

- జోరుగా ఫిరాయింపులు
- గెలుపే లక్ష్యంగా వ్యూహాలు
- అంతర్గత చర్చల్లో కాంగ్రెస్ నేతలు
- అదే స్థాయిలో దూసుకుపోతున్న అధికార బీఆర్‌ఎస్
- వేగంగా మారుతున్న సమీకరణాలు




రేవంత్‌రెడ్డి

నరేందర్‌రెడ్డి

**కొడంగల్:** నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్‌కు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యు లు పార్టీ ఫిరాయిస్తున్నారు. కాంగ్రెస్ బాస్ అనుచరగణం చేపట్టిన ఆపరేషన్‌లో కొంతమంది గులాబీ నేతలు చిక్కుతున్నారు. ఇప్పటికే నియోజక వర్గ పరిధిలోని ఎనిమిది మండలాల్లో సంప్రదింపులు జరుగుతున్నాయి. సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, పీఏసీఎస్ చైర్మన్లతో పాటు మాజీ నేతలను సైతం కాంగ్రెస్ పెద్దలు కలుస్తున్నారు. ఇప్పటికే ఒక దఫా చర్చలు పూర్తయినట్లు సమాచారం.

**చక్రం తిప్పుతున్న సీనియర్లు**

మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో ఈ ఆపరేషన్ స్పీడ్ అందుకుంది. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో అధికారం అనుభవిస్తున్న నేతలంతా ఒకప్పుడు గురునాథ్‌రెడ్డి అనుచరులు కావడంతో వారికి మార్గం సులువైంది. దసరా తర్వాత ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని హస్తం శ్రేణులు చర్చించుకుంటున్నాయి. కాగల కార్యం గంధర్వులు తీర్చినట్లు రేవంత్ విజయాన్ని గురునాథ్‌రెడ్డి వర్గం చాలెంజ్‌గా తీసుకుంది. ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఓటమే లక్ష్యంగా వీరంతా పని చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. అయితే సీఎం కేసీఆర్ కొడంగల్ నియోజకవర్గానికి అధిక మొత్తం లో నిధులు కేటాయించి అభివృద్ధి చేశారని ఎమ్మెల్యే వర్గీయులు చెబుతున్నారు. బీఆర్‌ఎస్‌తో లబ్ధి పొంది ఎన్నికల వేళ మోసం చేయడం సరికాదని పట్నం వర్గీయులు సూచిస్తున్నారు.

**జోరుగా బెట్టింగులు**

నవంబర్ 30న నిర్వహించనున్న ఎన్నికలో కొడంగల్ అసెంబ్లీ స్థానంపై బెట్టింగులు జోరుగా సాగుతున్నాయి. రేవంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి అభిమానులు రూ.వేలల్లో పందేలు కాస్తున్నారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ రెడ్డి, రెండోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా నరేందర్‌రెడ్డి పోటీ పడుతున్నారు. 2018 ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి నరేందర్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. 2023లోనూ వారిద్దరే తలపడుతుండడంతో అభిమానుల్లో టెన్షన్ నెలకొంది. ఇప్పటికే ప్రచారంలో నరేందర్‌రెడ్డి ముందంజలో ఉన్నారు. సంక్షేమ పథకాలను వివరిస్తూ.. కుల సంఘాలను సమ్మేళనాలు నిర్వహిస్తూ తమదైన శైలిలో దూసుకుపోతున్నారు. మంత్రి మహేందర్‌రెడ్డి సైతం నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మరోసారి తమ్ముడి విజయం కోసం వ్యూహాలు రచిస్తున్నాడు.

# పోలీసు అమరవీరుల త్యాగం మరువలేనిది

**కలెక్టర్ నారాయణరెడ్డి**

**వికారాబాద్ అర్బన్:** పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని.. వారి సేవలను స్మరించుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల అమరుల స్థూపానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిక్షణతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. ప్రజల ప్రశాంతత కోసం సేవలందిస్తున్నందుకుగాను పోలీసు వ్యవస్థ గర్వించాలన్నారు. ప్రజల సంరక్షణ కోసం ఇటీవల 189 మంది పోలీసులు తమ ప్రాణాలను కోల్పోయారని గుర్తు చేశారు. జిల్లాలో పోలీసు శాఖ గ్రామీణ స్థాయి నుంచి మండల స్థాయి వరకు విశిష్ట సేవలు అందిస్తూ శాంతిభద్రతలను పరిరక్షిస్తోందన్నారు. ప్రస్తుతం ఎన్నికల్లోనూ ఉత్తమ సేవలు అందిస్తూ.. ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. 1959 అక్టోబర్ 21న ఇండియా చైనాకు మధ్య సియాజిన్ అనే ప్రాంతాన్ని అక్రమంగా ఆక్రమించుకునే దశలో జరిగిన పోరాటంలో పంజాబ్ పోలీసులు వీరోచితంగా పోరాడి 21 మంది తమ ప్రాణాలను కోల్పోయారని గుర్తు చేస్తూ ఈ పోలీసు అమరవీరుల దినోత్సవం అక్టోబర్ 21న జరుపుకుంటున్నామన్నారు. ఎంతో మంది పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేస్తుంటారని.. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రాణత్యాగాలు చేసిన వారిని స్మరించుకోవాలన్నారు. వికారాబాద్‌లో గతంలో మావోయిస్టులు సంచరించే వారని వారిని తరిమి కొట్టి ప్రశాంత వాతావరణ నెలకొల్పారన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి ఎస్పీ కోటిరెడ్డిలు అమరవీరుల స్థూపం వద్ద అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు మురళీధర్, రవీందర్ రెడ్డి, డీఎస్పీలు, సీఐలు, పోలీసులు పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపానికి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

# బీజేపీలో బీసీ నినాదం

- తాండూరు అసెంబ్లీ నుంచి వారికే అవకాశం
- ఇద్దరు నేతల పేర్లను పరిశీలిస్తున్న అధిష్టానం



**తాండూరు:** తాండూరు అసెంబ్లీ స్థానానికి బీజేపీ బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతను అభ్యర్థిగా ప్రకటించేందుకు సిద్ధమైంది. అందుకు ఇద్దరు నేతల పేర్లను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు పోటాపోటీగా ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఆరు నెలల క్రితం నియోజకవర్గంలో బీజేపీ అనుకూల పవనాలు వీచాయి. కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత అనూహ్యంగా కమల దళం డీలా పడింది. నెల క్రితం వరకు నలుగురు స్థానిక నేతలు పోటీ పడ్డారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఇద్దరు నేతలు తెరమరుగయ్యారు. ప్రస్తుతం మాజీ మంత్రి చందు మహరాజ్ తనయుడు నరేశ్ మహరాజ్, పార్టీ జిల్లా కార్యదర్శి యు.రమేశ్‌కుమార్ టికెట్ రేసులో ఉన్నారు. ఇద్దరు బీసీ సామాజిక వర్గానికి చెందిన వారే కావడంతో అధిష్టానం బలాబలాలను అంచనా వేసే పనిలో నిమగ్నమైంది. నెల రోజుల క్రితం వరకు అసెంబ్లీ రేసులో ఉన్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్ పోటీ పడినా తర్వాత సైలెంట్ అయ్యారు. దీంతో పార్టీ సమావేశాలు తప్ప ఎక్కడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించిన దాఖలాలు లేవు. ఇప్పటికే బీజేపీకి 20శాతం ఓటు బ్యాంకుండగా.. స్థానిక నేతల అభిప్రాయ బేధాలతో మరింత సన్నగిల్లుతోందని పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి.

### సవాళ్లను అధిగమించాలి

ఓయూ ఓఎస్‌డీ వీసీ రెడ్యానాయక్

**మొయినాబాద్:** విద్యార్థులు పోటీ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఉస్మానియా యూనివర్సిటీ ఓఎస్‌డీ వైస్ చాన్సిలర్ బి.రెడ్యానాయక్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఎంబీఏ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎంబీఏలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేశారు. పట్టభద్రులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అమృత్, ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా రథోత్సవం

**అనంతగిరి:** దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం వేంకటేశ్వర స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయం నుంచి పట్టణ ప్రధాన వీధుల మీదుగా భక్తుల కోలాటం, చెక్క భజనల నడుమ శోభాయాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మహిళలు, పట్టణ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**సింహవాహనంపై పద్మనాభుడు**

దసరా నవరాత్రులను పురస్కరించుకుని వికారాబాద్ పట్టణ ఆలంపల్లిలోని అనంతపద్మనాభ స్వామి ఆలయ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం రాత్రి స్వామి వారు సింహ వాహనంపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగారు.



రథోత్సవంలో పాల్గొన్న వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్



సింహ వాహనంపై ఊరేగుతున్న పద్మనాభ స్వామి



దేవుళ్ల వేషధారణలో చిన్నారులు

# వైభవంగా పూల పండుగ

ప్రకృతిని ఆరాధించే పూల పండుగ వైభవంగా కొనసాగుతోంది. గునుగు, తంగేడు పూలతో బతుకమ్మలు పేర్చిన మహిళలు.. వీటిని ఆలయాలు, కూడళ్ల వద్ద పెట్టి సందడిగా ఆడిపాడుతున్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలో నిర్వహించిన వేడుకల్లో మహిళలు, యువతులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ అని తెలిపారు. – అనంతగిరి



బతుకమ్మతో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల



వికారాబాద్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

### 178 మంది నుంచి రూ.7,97,87,782 సీజ్

77 కేసులకు అప్పీల్ చేసుకోగా

34 కేసులకు పరిష్కారం

**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ తనిఖీల్లో 178 మంది నుంచి రూ. 7,97,87,782 సీజ్ చేసినట్లు రంగారెడ్డి కలెక్టర్ భారతి హోళికేరి ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందులో 77 కేసులకు అప్పీల్ చేసుకోగా, 34 కేసులు పరిష్కరించి రూ.1,25,66,074ల నగదును విడుదల చేసినట్లు తెలిపారు. రూ.10 లక్షలకు పైగా ఉన్న కేసును ఇన్‌కమ్ టాక్స్ విభాగానికి అప్పగించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సీజ్ చేసిన నగదు విడుదలకు జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ చైర్మన్‌గా జెడ్పీ సీఈఓ దిలీప్ కుమార్‌ను నియమించినట్లు చెప్పారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రూ.50 వేలకు మించి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న/రవాణా చేస్తున్న నగదు సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు.

# పేదల సంక్షేమమే ధ్యేయం



చౌడాపూర్ నాయకులతో కలిసి అభివాదం చేస్తున్న టి.రామ్మోహన్‌రెడ్డి తదితరులు

**డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి**

**కుల్కచర్ల:** రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి అన్నారు. శనివారం చౌడాపూర్ మండల పరిధిలోని మందిపల్, వీరాపూర్, విఠలాపూర్, ఈర్లవాగు తండాలో ఆరు గ్యారెంటీ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఆర్‌ఆర్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుటుంబ సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తే.. కాంగ్రెస్ నిరుపేదల సంక్షేమానికి పనిచేస్తుందన్నారు. నియంతపాలనకు ప్రజలు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, ఏకకాలంలో రూ.2లక్షల రుణ మాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు గౌరవ భృతి, రైతుబంధు పెంపు వంటి అద్భుతమైన పథకాలు అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, చౌడాపూర్ మండల అధ్యక్షుడు ఎల్పాటి అశోక్ కుమార్, కుల్కచర్ల మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, నాయకులు ఉమాపతిరెడ్డి, రాము పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ధారూరు మార్కెట్ కార్యదర్శిగా సిద్ధమ్మ



ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా శనివారం ఎం. సిద్ధమ్మ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇన్నాళ్లు ఇన్‌చార్జి బాధ్యతలు వికారాబాద్ నిర్వహించారు. తాండూర్ మార్కెట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సిద్ధమ్మను కార్యదర్శిగా నియమించారు.

**817 మొక్కజొన్న సంచుల రాక**

ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 817 బస్తాల మొక్కజొన్న సంచులు వచ్చాయని నూతనంగా నియమితులైన కార్యదర్శి సిద్ధమ్మ తెలిపారు. బీట్లలో మొదటి రకం క్వింటాల్‌కు రూ. 2,200, మధ్య రకంగా రూ. 2,160, మూడవ రకం రూ. 1,970 వరకు అమ్మకాలు జరిగాయని ఆమె వివరించారు.

### ఎన్నికల విధులపై శిక్షణ

బొంరాస్‌పేట: ప్రస్తుతం జరగనున్న ఎన్నికల విధులపై బీఎల్‌ఓలు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ వెంకటేశ్ అన్నారు. శనివారం సమావేశంలో మండల కార్యాలయ సమావేశం హాలులో బూత్ లెవల్ సిబ్బందికి ఎన్నికల నియమావళి ఫారం6, ఫారం8, తదితర అంశాల పట్ల శిక్షణ ఇచ్చారు. ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఆయన సూచించారు. రాజకీయ పార్టీల గుర్తులు, పోస్టర్లు, గోడలపై రాతలు, పార్టీల నేతలు, నాయకుల కట్‌ఔట్‌లు తొలగించాలని ఎస్‌ఐ శంకర్ ఆదేశించారు. పోలీసుల విధులకు ప్రజలు సహకరించేలా అవగాహన కల్పించాలన్నారు.

### రూ.4లక్షలు పట్టివేత



పూడూరు: ఎన్నికల నేపథ్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ. 4లక్షలు పట్టుబడ్డాయని చన్గోముల్ ఎస్‌ఐ గిరి తెలిపారు. శనివారం మండలంలోని కొత్తపల్లి గేటు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా హైదరాబాద్‌కు చెందిన ఆసిఫ్‌ఖాన్ వాహనంలో రూ.4లక్షలు లభ్యమయ్యాయి. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఆ నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

### బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా దొండ రమణారెడ్డి

ఇబ్రహీంపట్నం: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా రాయపోల్ గ్రామానికి చెందిన దొండ రమణారెడ్డిని నియమించారు. ఈ మేరకు శనివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఆయనకు నియామక పత్రం అందజేశారు. అనంతరం రమణారెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలకు తగిన న్యాయం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.


## సాక్షి సండే క్లాసిఫైడ్స్

**AUTO MOBILE**

**VEHICLES FOR SALE**

■ టాటా 2518, 2020/2021 మోడల్ ఏసి కంటెయినర్ లారీలు అమ్మబడును. సంప్రదించండి. ఫోన్: 93921 21613 / 93462 22352 [B-786410]

**REAL ESTATE**

**PLOT FOR SALE**

■ HYD, బాలానగర్ మండలం ద్వారకామయి ఆఫీసర్స్ కాలనీలో 300 Sq. Yds ఓపెన్ ప్లాట్ W/F, (45x60) పక్కాటైటిల్, LRS 6 నెలలు టైమ్. డైరెక్ట్ ఓనర్. ఫోన్ : 9441922102 [HA-1783]

**FLAT FOR SALE**

■ '0' Kms from SEZ Financial Dist, Gachibowli, Hyd. Luxury Gated Apartments, 2 / 3 / 4 BHK Flats for Sale. Near Google, Amazon etc., Ph : 9849025003. [HA-11785]

**WANTED**

■ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. Ph: 8977639662 / 8977639663 [H-189343]

■ విజయవాడలో A/C & Coolers రెంటల్ (tow-erac.com) కంపెనీకి A/C టెక్నీషియన్స్-3, దోస్త్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ:18 - 25,000 ట్రైనింగ్ / భోజనం / వసతి ఫ్రీ. ✆ 91771 77244 [B-1206681]

■ రామకృష్ణ హోంకేర్ సర్వీస్: VJA, HYD శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులసేవకు వంట/ఇంటిపని, బేబీకేర్ వర్కర్స్ కావలెను. జీ. 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు ✆ 6281208600, 6281208656 [B-1068136]

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


# కాబోయే సీఎం రేవంత్‌రెడ్డి

- తాండూరులో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం: డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

పెద్దేముల్: తెలంగాణకు కాబోయే సీఎం రేవంత్‌రెడ్డి అని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి జోస్యం చెప్పారు. శనివారం పెద్దేముల్ మండల మంబాపూర్ గ్రామంలో మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి ఇంట్లో జనగాం, మంబాపూర్, మారేపల్లి, పెద్దేముల్, ఖానాపూర్, రుక్మాపూర్‌లకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులతో జరిగిన చర్చలు సఫలమయ్యాయి. పలువురు బీఆర్‌ఎస్ ముఖ్యనాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు అంగీకరించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకోనున్నారు. అనంతరం మనోహర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని ఆరోపించారు. సోనియాగాంధీ ప్రవేశ పెట్టిన ఆరు పథకాలను చూసి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథ పడుతున్నారు. తాండూరులో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పాలనపై ప్రజలు విరక్తి చెందారని, అందుకే ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. కేసీఆర్ 10ఏళ్లుగా అబద్దాలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. మారోసారి మోసపోతే గోస తప్పదన్నారు. రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకునేందుకు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలపించాలని కోరారు. పలువురు బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీలో గుర్తింపు లేకనే కాంగ్రెస్ పార్టీలో చేరడం జరుగుతుందన్నారు. పెద్దేముల్ మండలంలో 5వేల మెజార్టీ కాంగ్రెస్ అభ్యర్థికి తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మైపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అంజయ్య, మల్లేశం, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

**కాంగ్రెస్ పార్టీదే అధికారం మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్**

బంట్వారం: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారమని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం బంట్వారం మండల కేంద్రంలో విజయ సంకల్ప సభ నిర్వహించారు. సభకు హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలంటూ నాయకులు ,కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని కోరారు. కేసీఆర్ మోసపు మాటలు ప్రజలకు తెలిసిపోయాయని, బీఆర్‌ఎస్‌ను చిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. నియోజకవర్గంలో తన హయాంలో వేసిన రోడ్లపై స్థానిక ఎమ్మెల్యే తట్టెడు మట్టి కూడా వేయలేదని విమర్శించారు. అంతకు ముందు బంట్వారం ,సుల్తాన్‌పూర్ సర్పంచ్‌లు లావణ్య ,బర్కత్‌పల్లి నర్సింలు మాజీ జెడ్పీటీసీ సునీత అనుచరులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశం ,ఎంపీపీ ప్రభాకర్ ,జెడ్పీటీసీ సంతోష ,స్థానిక ఎంపీటీసీ పద్మ ,డీసీసీ ఉపాధ్యక్షుడు రంగారెడ్డి ,యూత్ వింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి హరీశ్వర్‌రెడ్డి , కురుమ సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు ఆలంపల్లి శ్రీనివాస్ , నాయకులు రత్నారెడ్డి ,వాహిద్ ,రాజు ,ఎన్.నర్సింలు , పురుషోత్తంరెడ్డి ,శివకుమార్ ,వెంకటేశం, సంజీవ్ , శంకర్ యాదవ్ ,తౌఫిక్ ,మున్నాభాయ్ ,అజీమ్ ,గౌస్, సలీం తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా

డీఎస్పీ కరుణాసాగర్ రెడ్డి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి

దోమ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెడుతున్నామని డీఎస్పీ కరుణాసాగర్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మోత్కుర్‌లో ఎంపిక చేసిన జిల్లా పరిషత్ పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని సీఐ వెంకటరామయ్యతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎన్నికల నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేయాల్సిన వసతులపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి పోలింగ్ కేంద్రం పోలీసుల పహారాలో ఓటింగ్ జరుగుతుందని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రజలు, రాజకీయ పార్టీల నేతలు పోలీసులకు సహకరించాలని కోరారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రవిగౌడ్, గ్రామస్తులు, ఆయా పార్టీల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# గెలిపించండి మరింత అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

మర్పల్లి: ఎన్నికల్లో తనను మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన మర్పల్లి మండలంలోని కుడుగుంట ,రావులపల్లి ,పెద్దాపూర్ ,తిమ్మాపూర్ ,గుర్రంగట్టు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి , సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. కాంగ్రెస్ ,బీజేపీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ,మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారమన్నారు. కేసీఆర్‌పై ప్రజలకు అపారమైన విశ్వాసం ఉందని , మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. అనంతరం పలువురు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ లలిత, జెడ్పీటీసీ మధుకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి , వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి ,యూత్ వింగ్ మండల అధ్యక్షుడు మధుకర్ ,కోఆప్షన్ సభ్యుడు సోహెల్ , రైతుబంధు మండల అధ్యక్షుడు నాయబ్‌గౌడ్ ,నాయకులు రమేష్ , అశోక్, రాచయ్య, రమేష్ మిత్ర, గౌస్, గోపాల్ రెడ్డి, ఎంపీటీసీ రవి ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

**మరోసారి ఆశీర్వదించండి ఎమ్మెల్యే సతీమణి సబిత**

ధారూరు: ఐదేళ్ల కాలంలో నాభర్త నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతర సేవచేశారని, ఆయనను మరోసారి ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ భార్య సబిత ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ధారూరు మండలంలోని మున్నూరుసోమారం గ్రామంలో గడపగడపకూ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో ప్రజాభీష్టం మేరకు ఉందని, రానున్న కాలంలో అందరికి ప్రభుత్వ ఫలాలు అందుతాయని వివరించారు. కారుగుర్తుకు ఓటు వేసి తన భర్తను గెలిపిస్తే వికారాబాద్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తారని ఆమె చెప్పారు. ప్రచారంలో జెడ్పీటీసీ సుజాత, మాజీ ఎంపీపీ ఉమా పార్వతి, బీఆర్‌ఎస్ నాయకుడు రాములు, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్యారంటీ స్కీమ్‌లకు మంచి ఆదరణ

జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఆమేర్ అబ్దుల్లా



ర్యాలీ తీస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

తాండూరు: ఆరు గ్యారంటీ పథకాలకు ప్రజలల్లో మంచి ఆదరణ లభిస్తోందని వికారాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఆమేర్ అబ్దుల్లా అన్నారు. శనివారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో తాండూరు పట్టణంలో వందలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. పట్టణంలోని సమద్ ఫంక్షన్ హాల్ నుంచి మొదలైన ర్యాలీ మార్వాడి బజార్, భద్రేశ్వర్‌చౌక్, గాంధీచౌక్, మీదుగా పట్టణంలోని పలు కూడళ్లలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమేర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో దేశంలో కాంగ్రెస్ పార్టీకి బలం చేకూరిందన్నారు. సరిహద్దులో ఉన్న వికారాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నాలుగు అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకొంటుందన్నారు. యూత్ డిక్లరేషన్‌తో కాంగ్రెస్ పార్టీపై యువకులకు భరోసా కలిగిందన్నారు. మరోవైపు ఆరు గ్యారంటీ స్కీమ్‌లు ప్రజలకు పార్టీపై మరింత భరోసా కల్పించిందన్నారు. తాను తాండూరు అసెంబ్లీ టికెట్ ఆశించానని, అయితే టికెట్ ఎవరికి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి గెలుపు కోసం యూత్ కాంగ్రెస్ పని చేస్తోందన్నారు. తాండూరు పట్టణంలో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ ర్యాలీని యువతతో పాటు పార్టీ అభిమానులు స్వచ్ఛందంగా వచ్చారన్నారు. కార్యక్రమంలో తాండూరు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ లింగదల్లి రవికుమార్, కాంగ్రెస్ నాయకులు షుకూర్, మీనా శరీఫ్, శబ్బీర్, నవాజ్ పటేల్ తదితరులున్నారు.

## అనుమతి లేకుండా బైక్ ర్యాలీ: వ్యక్తిపై కేసు నమోదు

షాద్‌నగర్ రూరల్: అనుమతులు లేకుండా బైక్ ర్యాలీ నిర్వహించిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు షాద్‌నగర్ పట్టణ సీఐ ప్రతాప్‌లింగం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామం నుంచి పట్టణంలోని కోర్టు కాంప్లెక్స్ వెనక వరకు జమ్రుద్‌ఖాన్ అనే వ్యక్తి సుమారు 70 నుంచి 80 బైక్‌లతో ఎలాంటి అనుమతులు లేకుండా ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సభ్యుడు కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## కేటీఆర్‌ను కలిసిన ఆర్‌సీగౌడ్



కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్‌సీగౌడ్

తాండూరు రూరల్: మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన రావులపల్లి చంద్రశేఖర్‌గౌడ్(ఆర్‌సీ) కలిశారు. శనివారం సాయంత్రం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు హసేన్‌పటేల్ , రఘుగౌడ్‌లు ఉన్నారు.

## ఆర్మీ అభ్యర్థికి సన్మానం



శ్రీనును సన్మానిస్తున్న సర్పంచ్ కృష్ణ

దోమ: యువకులు దేశసేవలో భాగస్వాములు కావడం హర్షించదగ్గ విషయమని సర్పంచ్ కృష్ణ అన్నారు. శనివారం దోమ మండలంలోని దాదాపూర్‌కు చెందిన తోకని శ్రీను అగ్నిపథ్‌లో ఆర్మీ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ మేరకు గ్రామస్తులతో కలిసి శాలువాతో శ్రీనును ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత యువత చదువుపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఉద్యోగాల సాధనలో దృష్టి పెట్టాలన్నారు. యువత సన్మార్గంలో పయనించినప్పుడే ఉన్నతమైన స్థానాలను అధిరోహిస్తారని పేర్కొన్నారు. గ్రామంలోని యువత ప్రతి ఒక్కరూ శ్రీనును ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నర్సింహులు, ఉపసర్పంచ్ గఫార్, గ్రామస్తులు చందర్, చెన్నయ్య, బాలయ్య, ఈశ్వర్, వెంకటయ్య, గోపాల్, మహేశ్, బుగ్గయ్య, కిట్టు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు



సమావేశంలో ఎక్సైజ్ అధికారులు, సబ్ డివిజన్ పోలీసు అధికారులు

- ఎన్నికలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలి
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ కమిషనర్ డెవిడ్ రవికాంత్

తాండూరు: అక్రమ రవాణా అరికట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ కమిషనర్ డేవిడ్ రవికాంత్ అన్నారు. శనివారం పట్టణంలోని దుర్గా గ్రౌండ్‌లో జిల్లా ఎక్సైజ్ అధికారులు, కర్ణాటక రాష్ట్ర ఎక్సైజ్ అధికారులతో పాటు తాండూరు పోలీసు సబ్ డివిజన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంతరాష్ట్ర సరిహద్దులో అక్రమ సరుకు రవాణాపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఎక్సైజ్ కమిషనర్ మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారులు కర్ణాటక ఎక్సైజ్ అధికారులతో సమన్వయంతో కలిసి విధులు నిర్వహించాలన్నారు. సరిహద్దులో ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా పక్కా ప్రణాళికతో అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా జరిగేలా చూడాలన్నారు. జిల్లాలోకి అక్రమంగా మాదకద్రవ్యాలు, మద్యం రవాణాపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. అక్రమ రవాణ జరిగే ప్రాంతాల్లో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ చంద్ర మాట్లాడుతూ.. సరిహద్దులో ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. జిల్లాలో తాండూరు సర్కిల్‌పై ప్రధాన దృష్టి పెట్టామని తెలిపారు. డీఎస్పీ శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్సైజ్ పోలీసులు సహకరించాలన్నారు. ఇటీవల తాము అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సరిహద్దులోని పలు గ్రామాల్లో పోలీసుశాఖ కార్డెన్ సర్చ్‌లను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు నర్సింహులు గౌడ్, సంజయ్, విజయ్‌కుమార్, ధన్వంత్‌రెడ్డి, సైదులు, తదితరులున్నారు.

# కాంగ్రెస్ జెండా.. పేదలకు అండ



ఎమ్మెల్సీ కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న సర్పంచ్ రవీందర్ తదితరులు

ఎమ్మెల్సీ, కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: కాంగ్రెస్ జెండా ఎల్లవేలలా పేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్సీ, కల్వకుర్తి నియోజకవర్గ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గోవిందాయపల్లి సర్పంచ్ కంబాలపల్లి రవీందర్, వార్డు సభ్యులు రమేశ్, బీజేపీ నాయకులు శ్రీకాంత్, వెంకటయ్య, బాలేశ్వర్, అంజయ్య, శ్రీకాంత్, కృష్ణయ్య, జంగయ్య, ప్రశాంత్, పవన్, అభిగౌడ్, అభిషేక్, శేఖర్, నర్సింహ, బన్నీ, శ్రీశైలం, సత్తయ్య మరో 50 మంది కార్యకర్తలు కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి హస్తం గూటికి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపుతానన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు సోనియాగాంధీ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో నిరుద్యోగులు, పేద, మధ్య తరగతితో పాటు అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. కల్వకుర్తి గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరె గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు శేఖర్‌గౌడ్, జహంగీర్‌బాబా, వెంకటేశ్, ఇక్బాల్ ఉన్నారు.

## దేశానికే ఆదర్శం తెలంగాణ

మొయినాబాద్‌రూరల్: అభివృద్ధిలో దేశానికే ఆదర్శం తెలంగాణ అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని చిన్నమంగళారం, ఈరన్నపేట్ ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడపగడపకు ప్రజల వద్దకు వెళ్లి బీఆర్‌ఎస్‌ని ఆదరించి గెలిపించాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య కోరారు. గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసిన సీఎం కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేయాలన్నారు. సీఎం కేసీఆర్ ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడని నిరంతరం ప్రజా సేవ కోసమే పరితపిస్తారన్నారు. గత ప్రభుత్వాలు ప్రజలకు చేసిందేమి లేదన్నారు. చెరువులకు మిషన్ కాకతీయతో జలకళ తీసుకువచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కిందన్నారు. చిన్నమంగళారం నుంచి మహారాజ్‌పేట్‌కు వెళ్లే మూసీ వాగుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులు కొనసాగిస్తున్నామని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని సూచించారు. షాదీముబారక్, కళ్యాణలక్ష్మి, దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి, వితంతు, వికలాంగుల పించన్‌లు అందించడంలో ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా మరోసారి గెలిపించాలని ప్రజలను కోరారు. మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు జీవంతు, ప్రధాన కార్యదర్శి నర్సింహ్మాగౌడ్, చిన్నమంగళారం సర్పంచ్ హరిశంకర్‌గౌడ్, ఎంపీటీసీ మల్లేశ్, వార్డు సభ్యుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ బంగారంతో రూ.5 లక్షలకు టోకరా

నలుగురు నిందితుల అరెస్టు

యాచారం: నకిలీ బంగారం ఇచ్చి రూ.5 లక్షలతో ఉడాయించిన ఘటనలో శనివారం యాచారం పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. యాచారం మండలం నల్లవెల్లి తండాకు చెందిన లచ్చిరాం కొద్ది రోజుల క్రితం మాల్ యూనియన్ బ్యాంకులో రూ.5 లక్షల నగదును డ్రా చేసుకుని ఇంటికి వస్తుండగా ఏపీలోని నెల్లూరు జిల్లా సంగం మండల కేంద్రానికి చెందిన మాల్యాద్రి, ఇతని భార్య సుభాషిణి, రవి, ఇతని భార్య ధనమ్మ.. లచ్చిరాం కదలికలపై నిఘా పెట్టారు. లచ్చిరాం నల్లవెల్లి తండాకు వెళ్లడాన్ని గమనించి అతన్ని అనుసరిస్తూ ఇంటికి చేరుకున్నారు. వీరి వద్ద ఉన్న నకిలీ బంగారాన్ని చూపించి.. ఇది అసలు బంగారమేనని నమ్మించారు. దీని విలువ పెద్ద మొత్తంలో ఉంటుందని, తమకు అత్యవసరంగా రూ.10 లక్షలు కావాలని నమ్మబలికారు. వీరి మోసాన్ని పసిగట్టని బాధితుడు బ్యాంకు నుంచి తెచ్చిన రూ.5 లక్షలు ఇచ్చేశాడు. ఆ తర్వాత మాల్‌లోని ఓ దుకాణం వద్దకు తీసుకెళ్లి పరీక్షించగా బంగారం నకిలీదని తేలడంతో లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తుండగా.. శనివారం ఉదయం మాల్ సంతలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పీఎస్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా నల్లవెల్లి తండాలో లచ్చిరాంను మోసం చేసి నకిలీ బంగారం ఇచ్చి రూ.5 లక్షల నగదును తీసుకున్నట్లు ఒప్పుకొన్నారు. వీరిపై సంగారెడ్డి జిల్లా కంగ్టి పోలీస్ స్టేషన్‌లో కూడా కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు

- అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి
- షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



కేశంపేట: ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట: ఎన్నికల ముందు వచ్చి ప్రగల్భాలు పలికే ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని.. కారు గుర్తుకు ఓటేసి మరో మారు ఆశీర్వదించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కోనాయపల్లి, సంతాపూర్, కొత్తపేట గ్రామాల్లో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయా గ్రామాల్లో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో సీసీ రోడ్లు, యూజీడీ నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు వచ్చేలా చర్యలు తీసుకున్నామని గుర్తు చేశారు. గ్రామాలకు బీటీ రోడ్లు, గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించామని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్‌తోనే పేదలకు సంక్షేమ ఫలాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, కొత్తపేట సర్పంచ్ నవీన్‌కుమార్, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**స్వచ్ఛందంగా చేరికలు**

నందిగామ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్శితులై స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. నందిగామకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు అంజయ్యగౌడ్, రామేశ్వర్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, మధుసూదన్ గౌడ్ తదితరులు శనివారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ కుమార్ గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పద్మారెడ్డి, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, నాయకులు విక్రం శర్మ, పెంటయ్య గౌడ్, కిష్టయ్య, రాములు, రాంచంద్రారెడ్డి, అంజయ్య, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కడుపు నొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య

కొందుర్గు: కడుపునొప్పి భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం కొందుర్గు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లేడ్ చౌదరి గూడ మండలం రావిర్యాల గ్రామానికి చెందిన అమృతకు కొందుర్గుకు చెందిన కుమార్‌తో 14 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. అమృత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. శనివారం తెల్లవారుజామున భరించలేని నొప్పి రావడంతో ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతురాలు తల్లి సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.